సాక్షి
కుమురం భీం

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



పరిస్థితులు కథలై.. పుస్తకమై..
మంచిర్యాల జిల్లా జన్నారంకు చెందిన పల్లె వాసు పుస్తకాలు రాస్తూ ఆకట్టుకుంటున్నాడు. అటవీశాఖలో ఉద్యోగం చేస్తూనే తన ఆలోచ నలకు కథారూపం ఇస్తున్నాడు. 8లో▸



దుమ్ముతో తిప్పలు 9లో▸
సిర్పూర్(టి) పంచాయతీ పరిధిలో రహదారులు అధ్వానంగా మారాయి. దుమ్ము లేస్తుండటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.5 /17.5
పగలంతా ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. చలి ప్రభావం తగ్గుతుంది. అర్ధరాత్రి తర్వాత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా విగ్రహ వార్షికోత్సవం


హోమం చేస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో పెద్దవా గు సమీపంలోని శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శిరీష్‌శర్మ, నారాయణమూర్తి, విజయ్‌కుమార్ శర్మ, సూర్య నారాయణ, మహేశ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి గణపతి, గౌరీపూజ, స్వస్తి పుణ్యావచనం, నవగ్రహ పూజ, లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, మనుసూక్త హోవనం, బలిహరణం, పూర్ణాహుతి, మంగళహారతి, మహా మంత్రపుష్పం నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ అరిగెల నాగేశ్వర్ రావు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11 గంటల నుంచి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ధర్మపురి వెంకటేశ్వర్లు, గుండా వెంకన్న, మధు, రాధాకృష్ణచారి, గద్దల వెంకటేశ్, మురళీగౌడ్, గోపాల్‌నాయక్, గణపతి, ఇరుకుల సుధాకర్, లక్ష్మణమూర్తి, శరత్‌యాదవ్, రాజశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులు ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలకు ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారులు కూడా ఓటుహక్కు వినియోగించుకునేందుకు వెసులుబాటు కల్పిస్తున్నామని, వారికి కూడా సెలవు ఇవ్వాలన్నారు. ఆయా సంస్థలు యాజమాన్యాలు నిబంధనల ప్రకారం సహకరించాలని ఆదేశించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు


మాట్లాడుతున్న న్యాయవాదులు

ఆసిఫాబాద్‌అర్బన్: రంగారెడ్డి జిల్లా కోర్టులో ఈ నెల 12న ఓ నిందితుడు జిల్లా జడ్జిపై చెప్పు విసరడాన్ని ఖండిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్ మాట్లాడుతూ వివిధ నేరాల్లో నిందితుడిగా ఉన్న కిరణ్‌సింగ్ అలియాస్ సర్దార్ చీమకుర్తికి రంగారెడ్డి జిల్లా 9వ అదనపు సెషన్ జడ్జి జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారని తెలిపారు. అనంతరం అతడు మహిళా జడ్జిపై చెప్పు విసరడం బాధాకరమన్నారు. నిందితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. న్యాయవాదులు బానోత్ గణేశ్, శ్యాంరావు, గణపతి, విద్యాసాగర్, బోనగిరి సతీశ్‌బాబు, అనిత తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారితోషికం చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పారితోషకం చెల్లించాలని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆడె ప్రకాశ్ మాట్లాడుతూ గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేను ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమర్థవంతంగా పూర్తి చేశారని తెలిపారు. సర్వేలో పాల్గొన్న వారికి అందాల్సిన పారితోషకం నేటికీ అందలేదని, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మధుకర్, రాజేశ్వర్, తిరుపతి, శ్యాంసుందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పంటల లెక్క!

- జిల్లావ్యాప్తంగా మొదలైన డిజిటల్ సర్వే
- పైలెట్ ప్రాజెక్టు కింద 1.24 లక్షల ఎకరాల వివరాలు సేకరణ
- క్షేత్రస్థాయిలో వివరాల నమోదుకు 66 మంది సిబ్బంది


దహెగాంలో పంటల వివరాలు నమోదు చేస్తున్న ఏవో

దహెగాం(సిర్పూర్): క్రాప్ బుకింగ్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పంటల డిజిటల్ నమోదు సర్వే చేపట్టారు. ఎన్ని ఎకరాల్లో.. ఏయే పంటలు సాగు చేస్తున్నారు.. ఎంత దిగుబడి వస్తుంది.. అనే వివరాలు తెలుసుకునేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది. అలాగే రైతులు సాగుచేసిన పంటలు మార్కెట్‌లో విక్రయించుకోవడానికి సైతం వీలవుతుంది. అన్నదాతలు దళారులతో మోసపోకుండా దిగుబడి అంచనాలకు అనుగుణంగా ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 3 నుంచి ప్రారంభమైన సర్వే జిల్లాలో ప్రస్తుతం జోరుగా కొనసాగుతోంది. ఒక వ్యవసాయ క్లస్టర్ పరిధిలో సుమారు రెండు వేల ఎకరాలకు తగ్గకుండా వివరాలు సేకరిస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్టు కింద 1.24 లక్షల ఎకరాలు..
జిల్లాలో వానాకాలం సీజన్‌లో 4.50 లక్షల ఎకరాలు, యాసంగిలో 50 వేల ఎకరాల్లో పంటలు సాగు వుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో 1.24 లక్షల ఎకరాలను డిజిటల్ సర్వే చేయాలని ఆదేశించింది. ఈ నెల 3 నుంచి మండలాల్లోని గ్రామాలను క్లస్టర్లుగా ఎంపిక చేసుకుని.. ఒక్కో క్లస్టర్ పరిధిలో వ్యవసాయ అధికారులు 1,800 నుంచి 2000 ఎకరాల వరకు వివరాలు సేకరిస్తున్నారు. వ్యవసాయశాఖ జిల్లాల్లో సర్వే కోసం 66 మంది సిబ్బందిని కేటాయించింది. ఇదివరకు చేసిన పంటల నమోదులో సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లకుండా, కేవలం రైతుల వద్ద సేకరించిన వివరాలనే నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం సిబ్బంది తప్పనిసరిగా పంట పొలం వద్దకు వెళ్లాల్సి ఉంది. ఎన్ని ఎకరాల్లో ఏయే పంటలు వేశారో క్షేత్రస్థాయికి వెళ్లి ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లాల్లో పంటల సాగు పూర్తి సమాచారం ప్రభుత్వానికి నివేదించనున్నారు.

రైతులకు మేలు
డిజిటల్ సర్వే చేయడంతో పంట దిగుబడులు అమ్ముకోవడానికి రైతులకు ఇబ్బందులు ఉండవు. జిల్లాలో సాగు వివరాలు పూర్తిస్థాయిలో వెల్లడవుతాయి. పంటలు, దిగుబడి అంచనాలు రూపొందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయొచ్చని అధికారులు చెబుతున్నారు. ఒకే పంట కాకుండా ఇతర పంటల సాగుకు అవగాహన కల్పిస్తారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు వీలవుతుంది. అలాగే సాగు భూములకు పట్టాలు లేని వాటి వివరాలను ప్రత్యేకంగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తున్నారు. సర్వే పూర్తిచేసేందుకు తుది గడువు లేదని అధికారులు పేర్కొంటున్నారు.

సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు
జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సర్వేకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యవసాయ విస్తరణ అధికారులు నేరుగా పంట చేల దగ్గరికి వెళ్లాలి. ప్రతీ సర్వే నంబర్‌లో సాగు చేసిన పంట ఫొటో తీసి అక్కడి నుంచే వ్యవసాయశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎక్కడో ఉండి, ఎవరి పొలమో ఫొటో తీసి అప్‌లోడ్ చేయడం కుదరదు. సర్వే చేసే పొలానికి సంబంధించిన సర్వే నంబరు 25 మీటర్ల పరిధి వరకే యాప్ పనిచేస్తుంది. జిల్లాలో మారుమూల గ్రామాలకు సిగ్నల్ సమస్య వెంటాడుతుంది. చాలా గ్రామాల్లో సిగ్నల్ లేనందున డిజిటల్ సర్వేకు ఆటంకం ఏర్పడుతుంది. అలాగే సాగులో ఉన్నప్పటికీ దానికి సంబంధించిన పట్టా లేకపోవడంతో సమస్యగా మారుతోందని అధికారులు పేర్కొంటున్నారు. సాగుకు యోగ్యంగా లేని భూములను కూడా ఈ సర్వే ద్వారా గుర్తిస్తున్నారు. డిజిటల్ సర్వేకు వెళ్లిన వ్యవసాయాధికారులు పంటల పొలాల వద్దకు వెళ్లిన సమయంలో సిగ్నల్ లేకపోతే.. ఫొటో తీసుకుని సిగ్నల్ ఉన్న చోటకు వద్దకు వచ్చి అప్‌లోడ్ చేస్తున్నామని చెబుతున్నారు. పూర్తిగా సిగ్నల్ లేని ఏరియాల్లో శాటిలైట్ ద్వారా డిజిటల్ సర్వే చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు వారు పేర్కొంటున్నారు.

సిగ్నల్స్ లేనిచోట ఇబ్బందులు



జిల్లాలో డిజిటల్ పంటల సర్వే ఈ నెల 3 నుంచి ప్రారంభమైంది. పైలెట్ ప్రాజెక్టు కింద 1.24 లక్షల ఎకరాల వివరాలు సేకరించేందుకు 66 మంది సిబ్బందిని నియమించాం. ప్రతీ క్లస్టర్‌లో 18 వందల ఎకరాలకు తగ్గకుండా సర్వే చేస్తున్నాం. సిగ్నల్ లేనిచోట్ల మాత్రమే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– శ్రీనివాస్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

ఇంకా రోడ్లపైనే నిరీక్షణ..


కౌటాల సీసీఐ కేంద్రం వద్ద బారులుదీరిన పత్తి వాహనాలు

- పత్తి అమ్మకానికి రైతులకు అరిగోస
- దొంగల బెడదతోనూ తీవ్ర నష్టం
- తక్కువ ధరకు కొంటున్న ప్రైవేట్ వ్యాపారులు

కౌటాల(సిర్పూర్): ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకానికి రైతులకు కష్టాలు తప్పడం లేదు. కౌటాలలోని జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించేందుకు వచ్చిన రైతులు ఆధార్ సర్వర్ మొరాయించడంతో రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. వారం రోజుల అనంతరం పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాగా, ఈ నెల 10 నుంచి వందలాది పత్తి వాహనాలు జిన్నింగ్ మిల్లు నుంచి రెండు కిలోమీటర్ల దూరం నిలిచి ఉన్నాయి. మొగడ్‌దగడ్ చౌరస్తా వరకు రోడ్డు వెంబడి వాహనాలను క్యూలో ఉంచారు. ఐదు రోజులుగా రైతులు రాత్రంతా జాగారం చేస్తున్నారు. శుక్రవారం కూడా భారీగా వాహనాలు క్యూకట్టాయి. గత్యంతరం లేక కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు పత్తి విక్రయించి వెళ్లిపోతున్నారు.

దళారుల దోపిడీ..
సీసీఐ కేంద్రాల్లో సర్వర్ మొరాయించడంతో రోజుల రైతులు తరబడి పడిగాపులు కాస్తున్నారు. వాహనాలకు అధిక చార్జీలు చెల్లించలేకపోతున్నారు. కొంతమంది లోడ్ చేసిన వాహనాలు వెనక్కి తీసుకెళ్లిపోతున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు రైతుల ఇళ్లలో నిల్వ ఉంచిన పత్తిని తక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. లైసెన్స్ ఉన్న వారితోపాటు అనేక మంది లైసెన్స్ లేకున్నా ఇష్టారాజ్యంగా కాంటాలు ఏర్పాటు చేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.6500 వరకు చెల్లించి రాత్రికి రాత్రే మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

దొంగల చేతివాటం..
కౌటాల సీసీఐ కేంద్రం వద్ద రోజుల తరబడి పత్తి బండ్లు నిలిపి ఉండగా, రైతులకు దొంగల బెడద వేధిస్తోంది. వాహనాల నుంచి రాత్రి పూట దొంగలు వాహన సామగ్రి, బ్యాటరీలు, పత్తిని కూడా ఎత్తుకెళ్తున్నారు. బారులుదీరిన వాహనాలతో ఇతర వాహనదారులకు రాకపోకలు కష్టంగా మారాయి. ట్రాక్టర్లలో పత్తి తెచ్చిన రైతులు ట్రాలీని అక్కడే వదిలేసి ఇంజన్లు తీసుకుని ఇళ్లకు వెళ్లిపోయారు.

ప్రయోగ పరీక్షలు తనిఖీ

ఆసిఫాబాద్‌రూరల్: కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రయోగ పరీక్షలను శుక్రవారం డీఐఈవో కళ్యాణి తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రాక్టికల్స్ ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు జనరల్ విభాగంలో 570 మంది విద్యార్థులకు 543 మంది హాజరయ్యారని, ఒకేషనల్ విభాగంలో 75 మందికి 71 మంది హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు జనరల్ విభాగంలో 364 మందికి 348 మంది, ఒకేషనల్ విభాగంలో 106 మందికి 103 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

గిరిజన రైతుల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం తిర్యాణి మండలం మంగీ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రబండ గ్రామానికి చెందిన గిరిజన రైతులు ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ మాట్లాడుతూ గిరిజన రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. ఎర్రబండ గ్రామానికి చెందిన రైతులు 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు రెవెన్యూ అధికారులు గతంలో పట్టా మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం మండలానికి వచ్చిన తహసీల్దార్ వారి పట్టాలు రద్దు చేసినట్లు తెలపడంతో ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఫిర్యాదు చేసిన సమయంలో 15రోజుల్లో విచారణ చేపట్టి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయినా రెవెన్యూ అధికారులు నోటీసులు పంపుతున్నారని తెలిపారు. గిరిజన రైతులకు న్యాయం చేయని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, టీకానంద్, కృష్ణమాచారి, తిరుపతి, నిర్వాసిత రైతులు జంగు, బాజీరావ్, ఆత్రం ఆత్మరావ్, దేవ్, సోయం చిత్రు, మాంకు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ పాలకవర్గాల గడువు పెంపు

- మరో ఆరు నెలల వరకు అవకాశం


మంత్రి తుమ్మల చేతుల మీదుగా పొడిగింపు ఉత్తర్వులు అందుకుంటున్న డీసీసీబీ చైర్మన్లు

కైలాస్‌నగర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) పాలకవర్గాల గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ నెల 14తో పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీల మాదిరిగానే సొసైటీల్లోనూ ప్రత్యేకాధికారుల పాలనను అమలు చేస్తారనే చర్చ సాగింది. అయితే తమ పదవీకాలం పొడిగించాలంటూ రాష్ట్రంలోని డీసీసీబీ చైర్మన్లు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని స్వయంగా కలిసి విన్నవించారు. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం పీఏసీఎస్ పాలకవర్గాల పదవీకాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డీసీసీబీ చైర్మన్లకు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఉత్తర్వులు అందజేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లతో పాటు 77 సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు మరో ఆరు నెలల పాటు ఆయా పదవుల్లో కొనసాగనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గంగాపూర్ జాతర ఆదాయం రూ.44.07 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి జాతర హుండీని శుక్రవారం లెక్కించగా, రూ.44.07 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో చీఫ్ ఫెస్టివల్ అధికారి వేణుగోపాల్ గుప్తా, ఈవో బాపిరెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టారు. వేలం ద్వారా రూ.20.29 లక్షలు, జాతర ద్వారా టికెట్ల విక్రయం ద్వారా రూ.7.12లక్షలు, కేశఖండనం టికెట్ల ద్వారా రూ.4,880, స్వామి వారి కల్యాణం ద్వారా రూ.12,276, కల్యాణం కట్నాల ద్వారా రూ.46,770తో పాటు హుండీ ద్వారా రూ.16.01 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వెల్లడించారు. మొత్తంగా జాతర ద్వారా ఆలయానికి రూ.44.07 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి జాతర ద్వారా ఆలయానికి రూ.7.73 లక్షల అదనపు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

మళ్లీ ఎప్పుడో..?

- అల్బెండజోల్ మాత్రల పంపిణీ వాయిదా
- జిల్లాలో 1.96 లక్షల మంది విద్యార్థులు


కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కెరమెరి(ఆసిఫాబాద్): నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న చేపట్టాల్సిన అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం వాయిదా పడింది. ఏటా రాష్ట్ర ప్రభుత్వం 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 10న ఒకసారి, 17న మరోసారి పిల్లలకు మాత్రలు వేయాలని అధికారులు నిర్ణయించారు. ఏఎన్ఎంలు, ఇతర వైద్యసిబ్బందికి శిక్షణ కూడా కల్పించారు. ఆ తర్వాత అనివార్య కారణాలతో కార్యక్రమాన్ని వాయిదా వేశారు.

1.96 లక్షల మంది గుర్తింపు
జిల్లావ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఎంత మంది పిల్లలు ఉన్నారనే వివరాలు సేకరించి, అందుకు అనుగుణంగా అల్బెండజోల్ మాత్రల పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఈ ఏడాది 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 1.96 లక్షల మంది ఉన్నట్లు గుర్తించారు. జనవరిలోనే అన్ని గ్రామాల్లోని ఉపకేంద్రాల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అక్కడి నుంచి జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి నివేదిక అందించారు. మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు వారికి అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు వేయాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ఆరు నుంచి 15 ఏళ్లలోపు వారికి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, 16 నుంచి 18 ఏళ్ల వారికి కళాశాలల్లో, ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఇంటివద్దే మాత్రలు వేయాలని నిర్ణయించారు. వయస్సు ఆధారంగా ఎంత మోతాదులో మాత్ర వేయాలని శిక్షణ కల్పించారు. మళ్లీ పంపిణీ ఎప్పుడు ప్రారంభిస్తారనే దానిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు.

జిల్లా వివరాలు

మండలాలు	15
గ్రామ పంచాయతీలు	335
పీహెచ్‌సీలు	22
సీహెచ్‌సీలు	02
అంగన్‌వాడీ కేంద్రాలు	973
ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు	1,274
కళాశాలలు	43
విద్యార్థులు	1.96 లక్షలు

ఆదేశాలు రాలేదు



నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రల పంపిణీపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. జిల్లా వ్యాప్తంగా మాత్రల పంపిణీకి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వం నుంచి ఎప్పుడు ఆదేశాలు వచ్చినా వైద్యారోగ్యశాఖ సిద్ధంగా ఉంది.

– సీతారాం, డీఎంహెచ్‌వో

'పీఎం శ్రీ' పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పీఎం శ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పీఎం శ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 18 ప్రభుత్వ పాఠశాలలు పీఎం శ్రీ పథకానికి ఎంపికయ్యాయని తెలిపారు. మార్చిలోగా వందశాతం పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యార్థుల సౌకర్యార్థం మూత్రశాలలు, ప్రత్యేక తరగతి గదులు, ప్రహరీలు, సైన్స్ ల్యాబ్‌లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, కరాటేలో శిక్షణ అందించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి సిద్ధంగా ఉంచాలన్నారు. ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులు పనులను నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్‌వో అబిద్ అలీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాంధారి మైసమ్మ జాతర షురూ



మంచిర్యాల జిల్లా బొక్కలగుట్టలో శుక్రవారం గాంధారి మైసమ్మ జాతర ప్రారంభమైంది. మొదటిరోజు ఆదివాసీ నాయక్‌పోడ్‌లు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. 8లో▸

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు నియమించిన ఆర్వోలు, సహాయ ఆర్వోలకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణతో కలిసి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సంబంధిత అధికారులు ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలన్నారు. అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉప సంహరణ, అభ్యర్థుల తుది జాబితా, గుర్తుల కేటాయింపు, పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

కౌటాల: మండలంలోని గుండాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల హెచ్‌ఎం నానాజీని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం సాయంత్రం సదరు ఉపాధ్యాయుడు బోర్డుపై రాసిన హోం వర్క్‌ను ఆరోతరగతికి చెందిన కరుణ్, భూమిక, ఏడో తరగతికి చెందిన రాజ్‌కుమార్, గణేశ్ నోట్ బుక్‌లో రాయకపోవడంతో కోపంగా కర్రతో చితకబాదాడన్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మద్యం సేవించి పాఠశాలకు వస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై హెచ్‌ఎం నానాజీని వివరణ కోరగా తాను గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి వెళ్లానని, విషయాన్ని డీఈవోకు నివేదించినట్లు తెలిపారు. కాగా సదరు ఉపాధ్యాయుడు శుక్రవారం విధులకు హాజరు కాలేదు.

పంటచేనులో భారీ కొండచిలువ


కొండచిలువతో స్నేక్ క్యాచర్ వినీల్

నిర్మల్‌ఖిల్లా: పంటచేనులో భారీ కొండచిలువ చిక్కిన సంఘటన గురువారం రాత్రి జిల్లా కేంద్రం సమీపంలో చోటు చేసుకుంది. స్థానిక వెంకటాపూర్ నుంచి అక్కాపూర్ వెళ్లే దారిలో ఉన్న తన పొలంలో గురువారం రాత్రి బోరు ఆన్ చేసేందుకు రైతు సిద్దుల సురేష్ వెళ్లగా భారీ కొండచిలువ కనిపించింది. భయాందోళనకు గురైన సదరు రైతు జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో నివాసముండే స్నేక్ క్యాచర్ గిరిగంటి వినీల్‌కు సమాచారం అందించగా అతను వచ్చి చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నాడు. మేకపిల్లను మింగిన కొండచిలువ భుక్తాయాసంతో కదలలేని స్థితిలో ఉండిపోయింది. స్నేక్ క్యాచర్ వినీల్ సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

నలుగురు బైండోవర్

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నలుగురు పాత నేరస్తులను శుక్రవారం బైండోవర్ చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని భాగ్యనగర్, ఖుర్షీద్‌నగర్‌కు చెందిన వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పేకాడుతున్న ఏడుగురు..


లక్సెట్టిపేట: మండలంలోని బలరావుపేట గ్రామ శివారులో ఈ నెల 12న పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని శుక్రవారం తహసీల్దార్ దిలీప్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి గ్రామానికి చెందిన రమేశ్, తిరుపతి, రాజయ్య, ఓదయ్య, మల్లేశ్, సుధాకర్, సత్తన్నను అదుపులోకి తీసుకుని లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని నటరాజ్ థియేటర్ సమీపంలో ఇటీవల పాన్ షాప్‌లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి దొంగతనానికి పాల్పడిన మహాలక్ష్మివాడకు చెందిన మారి రతన్, వడ్డెర కాలనీకి చెందిన దాండ్ల మల్లన్నను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

పరిస్థితులు కథలై.. పుస్తకమై..

ఉద్యోగ రీత్యా ఎదురైన పరిస్థితులు, సమాజంలో జరుగుతున్న హృదయ విదారక సంఘటనలు, ఫారెస్టు డిపార్టుమెంట్‌లో మహిళలు చూపుతున్న ధైర్యసాహసాలు వీటన్నింటినీ కథలుగా మార్చాడు. ఈ కథలకు పుస్తక రూపంలో ప్రాణం పోశాడు. ఉద్యోగం చిన్నదైనా తన ఆలోచనలను పెద్దవిగా చేసి రెండు పుస్తకాలను పూర్తి చేశాడు. మూడో పుస్తకాన్ని కూడా రాయడం ప్రారంభించాడు జన్నారం మండల వాసి వాసు.



పుస్తకాలతో వాసు

- మూడు పుస్తకాలు రాసిన ఫారెస్ట్ సబార్డినేటర్
- చిన్ననాటి నుంచి స్క్రిప్టు రాయడంపై ఆసక్తి

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం గ్రామ పంచాయతీకి చెందిన పల్లె నర్సయ్య, సరోజ దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు. నర్సయ్య ఫారెస్టు బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తుండగా 2017లో అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పుడు కుటుంబ భారం అతల్లిపై పడింది. కుటుంబ పరిస్థితులను గుర్తించిన దంపతుల కుమారుడు పల్లె వాసు పదో తరగతి దూరవిద్య (డిస్టెన్స్), ఇంటర్, డిగ్రీ (బీఏ) కూడా దూరవిద్య ద్వారా పూర్తి చేశాడు. 2020లో కారుణ్య నియామకాల్లో భాగంగా తన తండ్రి పని చేసే ఫారెస్టు డిపార్టుమెంట్‌లోనే కార్యాలయ సబార్డినేటర్‌గా ఉద్యోగంలో చేరాడు. మొదటగా జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లో 2020లో ఉద్యోగంలో చేరాడు.రెండు సంవత్సరాలు పూర్తి చేసిన అనంతరం 2022లో ఆసిఫాబాద్ డివిజన్‌కు బదిలీ అయ్యాడు.

నవలలు చదవడంపై మక్కువతోనే..

పల్లె వాసుకు 12 ఏళ్ల నుంచే నవలలు చదవడంపై మక్కువ ఉండేది. 15 ఏళ్ల నుంచే స్క్రిప్టు రాసేవాడు. తన స్నేహితులతో కలిసి షార్ట్‌ఫిల్మ్ తీశాడు. అనుకోకుండా తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో పరిస్థితులు మారాయి. తర్వాత ఉద్యోగం పొందాలని పది, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్‌లో పాసయ్యాడు. ఫారెస్ట్ సబార్డినేటర్‌గా ఉద్యోగం పొందాడు. ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు విధులు ముగిసిన తర్వాత సాయంత్రం తనలోని ఆలోచనలను రాసుకునేవాడు. ఇలా తను చూసిన పరిస్థితులను గమనించి కథల రూపంలో పుస్తకం రాశాడు.

రెండు రోజుల్లో మరో పుస్తకం..

వాసు రాసిన ఫారెస్ట్ సింటినెల్ అనే పుస్తకాన్ని 2024 జనవరి 12న విడుదల చేశారు. ఫారెస్ట్ సెంటినెల్ అనేది ఒక మహిళా ఫారెస్ట్ గార్డు కథ. ఆమె ఎదుర్కొన్న సవాళ్లు, డిపార్ట్‌మెంట్‌లోని బాధ్యతలను హైలెట్ చేస్తుంది. అటవీశాఖలో మహిళల ధైర్య సాహసాలు, వారి విధులు, వివరిస్తూ పుస్తక రూపంలో ప్రాణం పోశాడు. రెండవది హర్ట్ హీల్ గ్రోథ్ అనే పుస్తకాన్ని 2024 డిసెంబర్‌లో విడుదల చేశాడు. ఈ పుస్తకం లవ్ ఫెయిల్ అయి ఎందరో ఆత్మహత్యలకు పాల్పడుతున్న తరుణంలో మానసిక ఆందోళనకు గురికాకుండా ఎలా బయట పడాలో వివరించాడు. ఇద్దరు ప్రేమికులు విడిపోయిన తర్వాత మానసిక సమస్యలతో పోరాడుతూ కొందరు తమ జీవితాలను ముగిస్తున్నారు. విడిపోయిన ప్రేమికులు ఎలా ముందుకు సాగాలి. ఆత్మహత్యలే పరిష్కారం కాదనే కోణంలో ఈ పుస్తక రచన చేసినట్లు వాసు తెలిపారు. మరో పుస్తకం వీ వెస్ నెవర్ మెంట్ టూ బీ (మనం ఎప్పుడూ అలా ఉండాలని అనుకోలేదు) ప్రేమ కథను పుస్తక రూపంలో బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాడు. మనం ఎప్పుడూ మనల్ని ఉద్దేశించని ప్రేమ కథ. దశాంతం ఏమీ లేకుండా పోయినప్పటికీ ఒక అమ్మాయిని ప్రేమించే వ్యక్తి కథ ఇది. ఈ పుస్తకం ఈనెల 17 న విడుదల చేయనున్నట్లు వాసు తెలిపారు.

జీవితంలో ఎన్నో అడ్డంకులు

> నా జీవితం చిన్నప్పటి నుండి అడ్డంకులు మరియు పోరాటాలతో నిండి ఉంది. తల్లిదండ్రులకు ఏకైక కుమారుడిని కావడంతో తల్లి, సోదరీమణులను జాగ్రత్తగా చూసుకోవాల్సి వచ్చింది. ఉద్యోగం వచ్చిన తర్వాత వారిని జాగ్రత్తగా చూసుకుంటూ విధులు నిర్వర్తిస్తున్నా. షార్ట్ ఫిల్మ్‌లు చేయడం, సినిమాలకు కథలు రాయాలని అనుకున్నా. కానీ జీవితంలో వచ్చిన అడ్డంకులతో నాలో ఉన్న ఆలోచనలను ఆపుకోలేక ఇలా రాస్తున్నాను.
>
> – పల్లె వాసు, రచయిత

గాంధారి మైసమ్మ జాతర షురూ


నదీజలాలతో దేవతామూర్తులను శుద్ధిచేస్తున్న ఆదివాసీలు

- సంప్రదాయ పూజల అనంతరం దేవతామూర్తుల ఊరేగింపు
- మొదటిరోజు ఉత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్


దేవతామూర్తులతో కలెక్టర్ కుమార్ దీపక్


దేవతామూర్తుల ప్రతిమలతో ఆదివాసీలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని బొక్కలగుట్టలో శుక్రవారం గాంధారీ మైసమ్మ జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగనున్న జాతరలో భాగంగా మొదటిరోజు ఆదివాసీ నాయక్‌పోడ్‌లు దేవతామూర్తులకు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. సదర్ భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం తప్పెటగూళ్ల ఆటలు, పిల్లనగ్రోవి వాయిద్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య దేవతామూర్తులతో ఊరేగింపుగా బొక్కలగుట్ట, గాంధారి వనం, గద్దెరాగిడి, ఏసీసీ మీదుగా మంచిర్యాల గోదావరినదికి తరలివెళ్లారు. సంప్రదాయబద్ధంగా నైవేద్యం సమర్పించి దేవతామూర్తులను శుద్ధిచేసిన అనంతరం సదర్‌భీమన్న ఆలయానికి చేరుకున్నారు.

జాతర ఘనంగా నిర్వహించాలి

అధికారులంతా సమన్వయంతో పనిచేసి మైసమ్మ జాతరను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సదర్ భీమన్న ఆలయం వద్ద మొక్కులు చెల్లించిన అనంతరం జాతర జరిగే ఖిల్లా ప్రాంతాన్ని సందర్శించారు. జాతర నిర్వహణ కమిటీ సభ్యులు, ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. ఖిల్లాపైన కాలభైరవుడి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

నేటి కార్యక్రమాలు...

జాతరలో భాగంగా రెండోరోజు శనివారం ఉదయం ఆదివాసీ నాయక్‌పోడ్‌లు గ్రామ దేవత పోచమ్మ తల్లికి పూజలు నిర్వహించి భీమన్న దేవునికి పట్నాలు వేస్తారు. సాయంత్రం గోదావరి జలాలతో దేవతామూర్తులకు మరోసారి అభిషేకాలు చేసి జాతర జరిగే ఖిల్లా దిగువ ప్రాంతానికి తీసుకెళ్తారు. రాత్రి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తప్పెటగూళ్ళ, లక్ష్మీదేవర కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మైసమ్మ తల్లికి పెద్దపూజ నిర్వహిస్తారు. కార్యక్రమంలో మందమర్రి తహసీల్దార్ సతీశ్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, ఆయా శాఖల అధికారులు, ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లన్న జాతర


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

ముధోల్: మండలంలోని ఎడిబిడ్ గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న మల్లన్న జాతర శుక్రవారం రాత్రి అగ్నిప్రవేశంతో ముగిసింది. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. బాసర, ముధోల్, కుభీర్, లోకేశ్వరం, తానూర్, కుంటాల మండలాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని నాందేడ్, ధర్మాబాద్, భోకర్, యావత్‌మాల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రథమ బహుమతి రూ.10 వేలు, వెండి కడియం, ద్వితీయ బహుమతి రూ.5 వేలు అందజేశారు.

615 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసు స్టేషన్‌లో బియ్యం లారీలతో సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులు

చెన్నూర్: తెలంగాణ జిల్లాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో పట్టుకున్నారు. రెండు లారీలు, టాటాఏస్‌లోని 615క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి, కరీంనగర్, గోదావరిఖని పట్టణాల నుంచి చెన్నూర్ మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఉదయం స్టేట్ ఎన్‌ఫోర్స్‌మెంటు, విజిలెన్స్ సివిల్ సప్లయ్ ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ రిటైర్డ్ ఏఎస్‌వో సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో చెన్నూర్ టోల్‌ప్లాజా వద్ద ఒక లారీ, చింతలపల్లి వద్ద మరో లారీ, బతుకమ్మ వాగు బ్రిడ్జి వద్ద టాటా ఏస్ ట్రాలీ వాహనం పట్టుకున్నారు. వాటిలోని 615 క్వింటాళ్ల బియ్యంతోపాటు వాహనాలను స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాట్లాడుతూ పట్టుకున్న మూడు వాహనాలను జిల్లా సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించామని తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నందుకు 6ఏ కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అధికారులు శ్రీనివాస్‌రావు, మంచిర్యాల ఏఎస్‌వో వేణుగోపాల్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోచయ్య పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

భైంసాటౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో బైక్ చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ గోపీనాథ్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మేకలవార్ సాయినాథ్ అతని స్నేహితులైన అనిల్, సురేష్‌తో కలిసి గత నెలలో పట్టణంలోని పంజేషా మసీద్ సమీపంలోని ఓ ఇంటిముందు, పక్కనే ఉన్న మరో గల్లీలో బైక్‌లు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. శుక్రవారం నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఎస్సై శ్రీనివాస్, క్రైమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, పీసీ ప్రమోద్‌ను ఎస్పీ జానకీ షర్మిల అభినందించినట్లు వెల్లడించారు.

ఆర్టీసీ బస్సులో మహిళ బ్యాగ్ చోరీ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో నివాసముంటున్న కేంద్రే కేరబాయి బ్యాగ్ శుక్రవారం ఆర్టీసీ బస్సులో చోరీకి గురైంది. బాధిత మహిళ శుక్రవారం మధ్యాహ్నం ఆదిలాబాద్‌లో ఉన్న బంధువుల ఇంటికి ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. ఆదిలాబాద్‌లో బస్సు దిగుతున్న క్రమంలో బ్యాగ్ కనిపించకుండా పోవడంతో బోరుమంది. బ్యాగులో రూ.50 వేల నగదు ఉన్నట్లు పేర్కొంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది.

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి, మస్కాపూర్ గ్రామాల్లోని పుట్టిరేవు ప్రాంతంలో గోదావరి తీరం వెంబడి మెట్‌పల్లి–ఖానాపూర్ ప్రధాన రహదారి సమీపంలోని పంటపొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ల వైర్లు గురువారం రాత్రి చోరీకి గురయ్యాయి. 10 మందికి సంబంధించిన విలువైన కాపర్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని శుక్రవారం రైతులు మాసుల లక్ష్మీరాజం, పార్శపు నర్సయ్య, కుమ్మరి శ్రీను, లింగాల శ్రీను, చిలుకూరి వెంకట్రాములు, శనిగారపు శంకర్, మొగిలి భీమేశ్, రొడ్డ వెంకట్రాజం, అంబటి గంగారెడ్డి, తుప్ప రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైర్ల విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

కుంభమేళాకు వెళ్లొస్తూ ఒకరు మృతి

నేరడిగొండ: కుంభమేళాకు వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు తమిళనాడు రాష్ట్రంలోని కన్యకుమారి జిల్లా లక్ష్మిపురం నార్త్‌సిటీకి చెందిన రాజేశ్, ముర్గన్ ఇద్దరూ కలిసి స్పోర్ట్స్ బైక్‌పై కుంభమేళాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మండలంలోని లింగట్ల బస్టాప్ వద్ద బైక్ వెనుక టైర్ పగిలిపోవడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఘటనలో తీవ్రగాయాలపాలైన రాజేశ్ (42)అక్కడికక్కడే మృతి చెందాడు. ముర్గన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పంచనామా అనంతరం మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు. మృతుడు ఆటో మెకానిక్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది.

‘పైలట్ ప్రజావాణి’ విజయవంతం


కలెక్టర్‌తో సమావేశమైన బృందం సభ్యులు

కైలాస్‌నగర్: పైలట్ ప్రాజెక్ట్‌గా జనవరి 27న ప్రారంభించిన సీఎం ప్రజావాణి ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంపై నిర్వహించిన బహిరంగ విచారణ జిల్లాలో విజయవంతమైనట్లు కార్యక్రమ రాష్ట్ర స్థాయి బృందం సభ్యులు వెల్లడించారు. రాజస్థాన్, జార్ఖండ్, బెంగళూర్, హైదరాబాద్, భువనగిరి, వికారాబాద్, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కిసాన్ మిత్ర, సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ, డిజిటల్ ఎంపవర్ ఫౌండేషన్, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, రైతు స్వరాజ్ వేదిక, సఫర్ వంటి పౌర సమాజ సంస్థలకు చెందిన 60 మంది వాలంటీర్లు బహిరంగ విచారణలో పాల్గొన్నారు. వారంతా శుక్రవారం కలెక్టర్‌తో తన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. ఈ నెల 6 నుంచి 14వ వరకు నిర్వహించిన 17 పబ్లిక్ హియరింగ్‌ల్లో పాల్గొన్నట్లుగా తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మిత్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ హర్ష, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పైలట్ ప్రజావాణి ఫిర్యాదుల బహిరంగ విచారణకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

ఉట్నూర్‌రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ఐదుగురు సీఆర్టీలను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాశ్ శుక్రవారం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలను తొలగించడంతో కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. దీనిపై పునరాలోచించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భీమారం: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మంచిర్యాల జిల్లా భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న మంచిర్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్న ఏ.వైష్ణవి, జీ.కార్తీక్, జే.రాఖీ, ఎస్.రాకేష్, చరణ్‌తేజ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్ రావు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం?

లక్ష్మణచాంద: పోలీస్ స్టేషన్‌లో ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన కుటుంబ సభ్యుల తగాదా కాస్త పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. అక్కడ మాట్లాడుతున్న సమయంలో ఓ వ్యక్తి గుర్తు తెలియని పురుగుల మందుతాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా గమనించిన పోలీసులు వెంటనే అతని వద్ద నుంచి పురుగుల మందు లాక్కున్నారు. వెంటనే 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిసింది.

పెళ్లి ఇష్టంలేక యువకుడు బలవన్మరణం

కుభీర్: పెళ్లి ఇష్టంలేక ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై పీ.రవీందర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బెలాం తండాకు చెందిన జాదవ్ రోహిదాస్ (30)కు మండలంలోని డొడర్నాకు చెందిన యువతితో ఈ నెల 17న వివాహం జరిపించాలని పెద్దలు నిశ్చయించారు. అయితే పెళ్లి ఇష్టంలేని సదరు యువకుడు గురువారం పంటచేనుకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుని తండ్రి జాదవ్ సుభాష్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ..

ముధోల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తరోడా వైపు నుంచి ఎడ్‌బిడ్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఎడ్‌బిడ్ వైపు నుండి తరోడా వైపు వస్తున్న బైక్ శుక్రవారం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో లోకేశ్వరం మండలంలోని మోల గ్రామానికి చెందిన అజయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ శివారు జాతీయ రహదారిపై ఈనెల 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలైన గుర్తు తెలియని మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. హాజీపూర్‌కు చెందిన పూస్కూరు శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై మంచిర్యాల వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మతిస్థిమితంలేని గుర్తు తెలియని మహిళ (55)ను ఢీకొట్టాడు. మహిళకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి..

సోన్: ఈ నెల 12న మద్యం మత్తులో పురుగుల మందుతాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని లెఫ్ట్ పోచంపాడు గ్రామానికి చెందిన దండుగుల కార్తీక్ (30)కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుని సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కే.గోపి తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన ఒకరు..

గుడిహత్నూర్: ఈనెల 12న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని గర్కంపేట్‌కు చెందిన ఉయిక మాధవ్ (52) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మాధవ్ తనకున్న ఎకరం భూమిలో ఈ ఏడాది పత్తి పంట సాగు చేశాడు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో దిగాలు చెందాడు. బుధవారం మధ్యాహ్నం పురుగుల మందుతాగి ఇంటికి వచ్చి భార్య భూంబాయికి చెప్పగా రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు.